
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

మంగళవారం 4 నవంబరు 2025

6న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల ఆరో తేదీన జరగనున్నాయని సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆరో తేదీ ఉదయం పది గంటలకు రెండో స్థాయీ సంఘ సమావేశం, 11 గంటలకు నాలుగు, మధ్యాహ్నం 12 గంటలకు ఏడు, ఒకటి స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఉదయం 10.30 గంటలకు మూడు, 11.30 గంటలకు ఐదు, మధ్యాహ్నం 12.30 గంటలకు ఆరో స్థాయీ సంఘ సమావేశం జరుగుతాయన్నారు.

కరెంటు కష్టాలు ఇంకెన్నాళ్లు?

వానొస్తే చీకట్లోనే సుమారు 650 గ్రామాలు

- మొంథా తుఫాన్ సమయంలో 40 గంటల పాటు అంధకారం
- ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రూ.4 కోట్లు విడుదల
- పనులు ప్రారంభానికి మోకాలడ్డుతున్న అటవీశాఖ
- ప్రతిపాదనలు పంపి ఏడాది గడిచినా మంజూరుకాని అనుమతులు



చింతపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని సుమారు 650 గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. తరచూ ఇదే సమస్య ఆయా గ్రామాల ప్రజలను వేధిస్తోంది. మొంథా తుఫాన్ సమయంలో సాంకేతిక సమస్య కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చింతపల్లి, జీకేవీధి మండలాల ప్రజలు 40 గంటల పాటు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి నిధులు మంజూరు చేసినా అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో ఇప్పటికీ ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ పనులు ప్రారంభంకాలేదు.

చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని సుమారు 650 గిరిజన గ్రామాలకు బలిఘట్టం 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. బలిఘట్టం 132/33 కేవీ సబ్ స్టేషన్‌కి కొరుప్రోలు 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. కొరుప్రోలు నుంచి చింతపల్లి వరకు ఎక్కడ సాంకేతిక సమస్య తలెత్తిన ఈ రెండు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. సాంకేతిక సమస్య పరిష్కరించే వరకు చింతపల్లి, జీకేవీధి మండలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గంలేదు. దీంతో గంటల తరబడి ఆదివాసీ గ్రామాల ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో ఈ సమస్యను ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్నారు. వర్షాల వలన కొరుప్రోలు నుంచి చింతపల్లికి వస్తున్న 33 కేవీ విద్యుత్‌లైన్‌పై చెట్ల కొమ్మలు విరిగి పడడం, పిడుగులు పడి ఇన్సులేటర్లు పగిలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సమస్యల వలన విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో విద్యుత్‌శాఖ సిబ్బంది సాంకేతిక సమస్యను పరిష్కరించే వరకు చింతపల్లి, జీకే వీధి మండలాలు చీకట్లో ఉండాల్సి వస్తోంది.

ప్రతిపాదనలను పట్టించుకోని గత ప్రభుత్వం

పాడేరు 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి చింతపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్‌కి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్



బలిఘట్టం నుంచి చింతపల్లికి సరఫరా జరుగుతున్న 33 కేవీ విద్యుత్ లైన్

లైన్ ఏర్పాటు చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కాలయాపన చేసిందే తప్పా పనులు ప్రారంభించలేదు. పాడేరు 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి జి.మాడుగుల వరకు 33 కేవీ విద్యుత్ సరఫరా జరుగుతోంది. జి.మాడుగుల నుంచి చింతపల్లికి 39 కిలోమీటర్లు అదనపు విద్యుత్ లైన్ నిర్మించి విద్యుత్ సరఫరా చేయాల్సి వుంది. ఈ అదనపు విద్యుత్ లైన్ నిర్మాణానికి 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సర్వే నిర్వహించింది. ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను మరుగునపడేసింది.

ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్‌కు రూ.4 కోట్లు మంజూరు

సీలేరు ఏపీ ట్రాన్స్‌కో నుంచి ప్రత్యామ్నాయ 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చింతపల్లి నుంచి దుప్పిలవాడ వరకు ఇప్పటికే 33 కేవీ విద్యుత్‌లైన్ నిర్మాణంలో ఉంది. ఈ విద్యుత్ లైన్ ద్వారానే జీకే వీధి మండల ప్రజలకు విద్యుత్ సరఫరా జరుగుతున్నది. సీలేరు నుంచి దుప్పిలవాడ వరకు తొమ్మిది కిలోమీటర్లు 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం చేపడితే సరిపోతుంది. ఈ మేరకు 2024 సెప్టెంబరు 8వ తేదీన ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఈపీడీసీఎల్ సీఎండీ సీలేరు నుంచి ప్రత్యామ్నాయంగా చింతపల్లికి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోద ముద్ర వేశారు. సీలేరు నుంచి ధారకొండ వరకు 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణాలకు అవసరమైన రూ.4 కోట్ల నిధులను ప్రభుత్వం 2024 నవంబరులో విడుదల చేసింది.

ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మిస్తే..

సీలేరు నుంచి చింతపల్లికి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మిస్తే చింతపల్లి, జీకేవీధి మండలాల గిరిజన గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుంది. కొరుప్రోలు, నర్సీపట్నం విద్యుత్ లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా గంటల తరబడి విద్యుత్ కోసం ఈ ప్రాంత ప్రజలు నిరీక్షించే పరిస్థితి ఉండదు. బలిఘట్టం 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చింతపల్లికి విద్యుత్

... మిగతా 8వ పేజీలో

శంభో శంకర నమఃశివాయ..

జిల్లాలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. మహా శివుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

- పాడేరు రూరల్/ఆంధ్రజ్యోతి



పాడేరులోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో గల శివాలయంలో విశేష అలంకరణలో సోమనాథేశ్వరుడు

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

ఉమ్మడి జిల్లాల వారీగా సమాచారం పంపాల్సిందిగా పాఠశాల విద్యా శాఖ ఆదేశం

- వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడనున్న ఖాళీల వివరాలు సేకరణలో అధికారులు
- పదవీ విరమణలు, పదోన్నతులతో భారీగానే ఖాళీలు?
- సుమారు 500 నుంచి 600 వరకు ఉండవచ్చునని ఉపాధ్యాయ సంఘాల అంచనా



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఖాళీల వివరాలు సిద్ధం చేయాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశించింది. వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని కేటగిరీ వారీగా నివేదిక సిద్ధం చేయాలన్న ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ వివరాల సేకరణలో నిమగ్నమైంది.

ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో అన్ని కేటగిరీలు కలిపి ఉమ్మడి జిల్లాలో 1,134 మందిని ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరికి గత నెల తొలివారంలో నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 400 ఖాళీలు, ప్రభుత్వ, జడ్పీ పరిధిలోని పాఠశాలల్లో సుమారు 150 ఖాళీలను తాజా డీఎస్సీ ద్వారా భర్తీచేశారు. ఇంకా ఏజెన్సీతోపాటు మైదానంలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీల్లో

... మిగతా 8వ పేజీలో

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

హెల్మెట్ ధరిస్తేనే జిల్లాలోకి అనుమతి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఎస్పీ అమిత్ బర్దార్, ఐటీడీఏ పీవో శ్రీపూజ



హాజరైన అధికారులు

- జాతీయ, రాష్ట్ర రహదారులపై సంతలను నివారించండి
- పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు
- మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయండి
- కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీవ్యాప్తంగా ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు విషయాలపై చర్చించి, ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన మార్గాల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద పర్యాటకులు లేదా స్థానికులు హెల్మెట్ ధరిస్తేనే జిల్లాలోకి రావడానికి అనుమతి ఇవ్వాలని, అలాగే మద్యం సేవిస్తే అనుమతి ఇవ్వొద్దని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాల్లో కాకుండా రద్దీగా ఉండే ప్రదేశాల్లో జీపులు, ఆటోలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు చేపట్టాలని, పార్కింగ్ స్థలాల్లోనే పార్కింగ్ చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఏ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవో నివేదికను ఇవ్వాలని, ఆర్టీసీ, డీఈవోలకు ఆదేశించారు. 25 టన్నులు దాటిన వాహనాలకు ఘాట్‌రోడ్డులో అనుమతి ఇవ్వొద్దని, పర్యాటక సీజన్ ప్రారంభం కానుండడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా, భద్రతపై పోలీస్‌శాఖ దృష్టిసారించాలని, జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులపై నిర్వహిస్తున్న సంతల కారణంగా ట్రాఫిక్, అలాగే ప్రమాదాలు జరిగే

... మిగతా 8వ పేజీలో

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి నియామకం

- సభ్యురాలిగా గొర్లె సునీత



సోళ్ల బొజ్జిరెడ్డి



గొర్లె సునీత

రంపచోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు సోళ్ల బొజ్జిరెడ్డిని నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రంపచోడవరం నియోజకవర్గానికే చెందిన టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు గొర్లె సునీతను ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియమించింది. సోళ్ల బొజ్జిరెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే గిరిజన హక్కులు, గిరిజన ఉపాధ్యాయ హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. బీజేపీ కోసం తన ఉద్యోగాన్ని కూడా వదిలేసి, గిరిజన గ్రామాల్లో తిరుగుతూ పార్టీకి ఎంతో ఉనికిని తెచ్చారు. అలాగే గొర్లె సునీత మాజీ మంత్రి గొర్లె ప్రకాశరావు కుమార్తె. ఆమె తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడంలో తన వంతు కృషి చేశారు. 2019 నుంచి, 2024 ఎన్నికల

... మిగతా 8వ పేజీలో

ఇలా ఉంటే ఎలా వెళ్లేది?

- దిగువశోభ- ఎగువశోభ మార్గంలో విరిగిపడిన కొండచరియలు
- రహదారి పూర్తిగా మూసుకుపోయిన వైనం
- ఆరు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- వారం రోజులైనా పట్టించుకోని అధికారులు



మొంథా తుఫాన్‌కు దిగువశోభ- ఎగువశోభ మార్గంలో విరిగిపడిన కొండచరియలు

అనంతగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువశోభ- ఎగువశోభ మార్గంలో కొండచరియలు జారి పడడంతో రహదారి పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఆరు గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వారం రోజుల క్రితం కొండచరియలు విరిగి పడగా, ఇప్పటి వరకు వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భీసుపురం నుంచి బొర్రా రైల్వేగేటు వరకు రింగురోడ్డును సుమారు నాలుగేళ్ల క్రితం నిర్మించారు. దిగువశోభ- ఎగువశోభ మధ్య కొండచరియలు జారిపడడంతో బీర్జిగూడ, సరసపోదోర్, పోర్నపోదోర్, దిగువశోభ, ఎగువశోభ గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం భీసుపురం నుంచి పూలుగుడ, ఎగువశోభ పంచాయతీ కేంద్రం వరకు మాత్రమే గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే బొర్రా వైపు నుంచి బిర్జిగూడ, సరసపోదోర్, పోర్లపోదోర్, దిగువశోభ గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా గ్రామాల గిరిజనులు మండల కేంద్రంతో పాటు మైదాన ప్రాంతాలకు వెళ్లాలంటే 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండచరియలను తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని ఎగువశోభ గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టం శ్యామ్, ఎస్.సుబ్బారావు, తదితరులు కోరుతున్నారు.



వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా రోడ్డు మూసుకుపోయిన దృశ్యం

పదోన్నతుల కోసం పైసా వసూల్

- డీసీసీబీలో కలెక్షన్ కింగ్‌లు
- పోస్టును బట్టి రేటు
- రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...
- మొత్తం రూ.కోటి?



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో పదోన్నతులకు భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకులో కీలక స్థానంలో ఉన్నవారికి సన్నిహితులైనవారు (అనధికార వ్యక్తులు) చేతులమీదుగా ఈ వ్యవహారం సాగినట్టు ఫిర్యాదులు వచ్చాయి.

బ్యాంకు ప్రధాన కార్యాలయంతో పాటు 33 బ్రాంచీలలో ఖాళీల మేరకు పదోన్నతులు కల్పించేందుకు గత నెల 23, 24 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక డీజీఎం, నాలుగు ఏజీఎం, నాలుగు చీఫ్ మేనేజర్, ఆరు మేనేజర్, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు బోర్డును ఏర్పాటుచేశారు. ఇందులో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, సీఈవో, ఆప్కాబ్ నుంచి జనరల్ మేనేజర్, ఆప్కాబ్ నామినేట్ చేసిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఒకరు ఉన్నారు. డీజీఎం పోస్టుకు ఒకరు, నాలుగు ఏజీఎం పోస్టులకు నలుగురు, నాలుగు చీఫ్ మేనేజర్ పోస్టులకు 18 మంది, ఆరు మేనేజర్ పోస్టులకు 20 మంది, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 60 మంది

... మిగతా 8వ పేజీలో

చాపరాయి జల విహారి పునఃప్రారంభం

- మొంథా తుఫాన్ కారణంగా వారం రోజుల పాటు బ్రేక్
- వాగులు తగ్గుముఖం పట్టడంతో సందర్శకులకు అనుమతి

డుంబ్రిగుడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహించడంతో మూతపడిన చాపరాయి జల విహారి కేంద్రాన్ని సోమవారం పునఃప్రారంభించారు. తుఫాన్ వలన గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు గెడ్డలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నుంచి చాపరాయి జలవిహారిని పునఃప్రారంభించి సందర్శకులను అనుమతించారు.

వన్ ధన్ వికాస కేంద్రాలపై కలెక్టర్ అసంతృప్తి

- ప్రణాళికలు లేకుండా కేంద్రాల నిర్వహణ సాధ్యమేనా? అని అసహనం
- మహిళలకు శిక్షణ ఇవ్వకుండా కేంద్రాన్ని ఎలా నడుపుతున్నారని నిలదీత

డుంబ్రిగుడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు చేసిన వన్ ధన్ వికాస కేంద్రాల (వీడీవీకే) నిర్వహణకు లక్షలు వెచ్చించి ప్రణాళికలు లేకుండా కొనసాగించడం సాధ్యమేనా? అని అధికారులపై కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని అరకు కేంద్రంగా కొర్రాయిలో చిరు ధాన్యాలతో బిస్కెట్లు తయారు చేసే వన్ ధన్ వికాస కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. బిస్కెట్ల తయారీకి వినియోగించే యంత్రాల పని తీరుతో పాటు తయారీ విధానం, మార్కెటింగ్‌కు అనుగుణంగా జరుగుతున్న ఉత్పత్తిపై అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కేంద్రం నిర్వహణకు లక్షలు వెచ్చించినప్పటికీ మార్కెటింగ్‌కు డిమాండ్ పెరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. లక్షలు వెచ్చించిన కేంద్రాలు మూతబడడానికేనా? అని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికలు లేకుండా కేంద్రాలు నడపడం సాధ్యపడదన్నారు. దీనికి తోడు తూతూ మంత్రంగా శిక్షణ ఇప్పించి వికాస కేంద్రాలను నడపడం సాధ్యంకాదన్నారు. ఇప్పటికైనా మహిళా సంఘాల సభ్యులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇప్పించి వారికి ఉపాధి కల్పించేలా తోడ్పాటు ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. శిక్షణ ఇప్పించి అందులో నైపుణ్యం కలిగిన మహిళలకు కేంద్రాల నిర్వహణ అప్పగిస్తే మార్కెటింగ్ సాధ్యపడుతుందన్నారు. సాగర పంచాయతీలోని కుసమగుడలో గల అడ్డాకులు, కొండచీపుర్ల వన్ ధన్ వికాస కేంద్రాన్ని సందర్శించి యంత్రాలను పరిశీలించారు. అడ్డాకుల ప్లేట్లు, కొండచీపుర్లతో వచ్చే ఆదాయాన్ని గురించి వారిని



వన్ ధన్ వికాస కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

... మిగతా 8వ పేజీలో



రహదారిపై వారపు సంతతో చిందరవందరగా ఉన్న వాహనాలు

రోడ్డుపై సంత.. వాహన చోదకుల చింత

- ఏఎల్ పురంలో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు.. ప్రజల అగచాట్లు

కృష్ణాదేవిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం రహదారిపైనే వారపు సంత నిర్వహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సోమవారం జరిగే సంతకు గొలుగొండ, కొయ్యూరు, చింతపల్లి, గూడెంకొత్తవీధి తదితర మండలాలకు చెందిన గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన రైతులు కూరగాయలను తీసుకువస్తారు. వీటిని కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రాంతాల వ్యాపారులు వస్తుందటారు. రహదారిపైనే కూరగాయాలు, ఇతర లావాదేవీల కోసం దుకాణాలు పెట్టడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంత వేలం పాట నుంచి రూ.లక్షలో ఆదాయం వస్తున్నప్పటికీ అధికారులు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదు. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టిసారించినప్పటికీ ఫలితం కానరావడం లేదు. ఇప్పటికైనా సంత నిర్వహణపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామానికి దూరంగా ప్రత్యేక ప్రదేశం ఏర్పాటు చేయడంపై దృష్టిసారించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడివాడ విద్యార్థిని



పోటీలకు ఎంపికైన భాగ్యశ్రీ, హెచ్ఎం రామారావు

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.భాగ్యశ్రీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. మూడు రకాల ఆటల పోటీల్లో సత్తా చాటి ఈ పోటీలకు అర్హత సాధించింది. పదో తరగతి చదువుతున్న భాగ్యశ్రీ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 100, 200 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం రామారావు తెలిపారు. భాగ్యశ్రీ, పీఈటీలను ఆయన అభినందించారు.

పట్టాలు ఇవ్వాలని గిరిజనుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న గిరిజనులు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజనులు ఆందోళనకు దిగారు. మాడుగుల మండలంలోని లోవపొన్నవోలు పంచాయతీ ఎల్.పొన్నవోలు, ఓంద్రువీధి, దిబ్బారు గ్రామాల గిరిజనులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. పూర్వీకుల నుంచి భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమని గిరిజనులు వాపోయారు. సర్వే నంబర్ 47లో 199.47 సెంట్ల భూమిలో వివిధ రకాల పంటలను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని కోరార. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.

జిల్లా స్థాయి రగ్బీ అండర్-14 పోటీలకు బాలబాలికల ఎంపిక



జిల్లా స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కె.కోటపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ అండర్-14 పోటీలకు బాల బాలికల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో గన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేశ్, అనకాపల్లి స్కూల్ గేమ్స్ సెక్రటరీ కెఎం నాయుడు, పాఠశాల హెచ్ఎం జీవీ.రాజు, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.

తామరంలో యూరియా సరఫరా

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



పంపిణీ కోసం గోదాము నుంచి తీసిన బస్తాలు

మాకవరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తామరం గ్రామంలో ఎట్టకేలకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. 'ఎరువు.. రైతులకు కరువు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమై విషయం తెలిసిందే. దీనిపై పీఏసీఎస్ అధ్యక్షుడు శీరంరెడ్డి నాగవెంకట చినబాబు, వ్యవసాయ అధికారులు స్పందించారు. ఈ మేరకు రైతులకు సుమారు 300 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. అనంతరం పీఏసీఎస్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఇంతవరకు మండలంలో యూరియా కొరత రాకుండా పంపిణీ చేశామన్నారు. సుమారు 840 టన్నుల యూరియాను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.అప్పారావు, సిబ్బంది శేషునాయుడు పాల్గొన్నారు.

పద్య పఠన పోటీలకు 300 మంది హాజరు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో పద్య పఠన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా రమణ, సంతోషి, లక్ష్మణ్ వ్యవహించారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు.

నల్ల బజారుకు కోటా బియ్యం

- రైస్ మిల్లుకు ఆటోలు, వ్యాన్లలో అక్రమంగా తరలింపు
- పట్టించుకోని అధికారులు.. ఇష్టారాజ్యంగా వ్యాపారులు

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోటా బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. ఆటోలు, వ్యాన్లలో రైస్ మిల్లులకు యథేచ్ఛగా రవాణా జరుగుతోంది. సంబంధిత అధికారులకు పట్టకపోవడంతో అక్రమ తరలింపు విచ్చలవిడిగా కొనసాగుతోంది.

ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రోజూ ఆటోలు, వ్యాన్లలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు గ్రామాలలో తిరిగి కార్డుదారుల వద్ద కిలో రూ.15 నుంచి రూ.16, మరి కొంత మంది నేరుగా డీలర్ల వద్ద రూ.18 నుంచి రూ.20కు కొనుగోలు చేసి అక్రమంగా వ్యాపారం సాగిస్తున్నారు. లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, మిల్లులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిసింది. నమ్మకమైన వ్యాపారులకు రైస్ మిల్లుల యజమానులు ముందుగానే కోటా బియ్యం కొనుగోలుకు పెట్టుబడిగా కొంత సొమ్ము ఇస్తున్నారని సమాచారం. తరువాత బియ్యం మిల్లులకు తెచ్చినప్పునప్పుడు మిగిలిన సొమ్మును అందిస్తున్నారని తెలిసింది. ఇలా కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని మళ్లీ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మేడివాడ, కొత్తకోట పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని రోలుగుంట రైస్ మిల్లుకు, రావికమతం నుంచి ఎర్రవాయి, బుచ్చియ్యపేట పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని చోడవరం-వెంకన్న పాలెం రైస్ మిల్లులకు వ్యాపారులు తరలిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత ఉనతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి తగిన చర్యలు చేపడితే అవకతవకలు బయటపడతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తకోట నుంచి రోలుగుంట రైస్ మిల్లుకు ఆటోలో తరలిస్తున్న కోటా బియ్యం



చోడవరంలోని ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు





మాడుగుల: ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు... దేవరాపల్లిలోని తిమిరాం ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

- శివ నామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- తెల్లవారు జాము నుంచే పూజలు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులతో పోటెత్తాయి. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అయితే కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చోటుచేసుకున్న దుర్ఘటన నేపథ్యంలో శైవక్షేత్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. స్థానిక స్వయంభూ గౌరీశ్వరాయలం, ముద్దుర్తిలోని పుణ్య స్నానాలు ఆచరించే సంగమయ్య గుడి వద్ద, గవరవరం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, జుత్తాడలోని శివాలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వయంభూ గౌరీశ్వరాలయం, ముద్దుర్తి సంగమేశ్వరాలయం వద్ద తెల్లవారు జాము నుంచే పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద తొక్కిసలాట జరగకుండా భక్తు లను దర్శనానికి పంపారు. దీంతో ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేట రామ భోగలింగేశ్వరస్వామి ఆలయం సోమవారం కిటకిటలాడింది. శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది. వేకువ జాము నుంచి పురోహితులు అభిషేకాలు నిర్వహించారు. వడ్డాది, విజయరామ రాజుపేట, రాజాం, నీలకంఠపురం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.

మాడుగులలో...

మాడుగుల: మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. హర హర మహాదేవ.. శంబో శంకర.. అంటూ భక్తులు స్మరించారు. కార్తీకమాస రెండో సోమవారం కావడంతో మాడుగుల కేంద్రంలోని శివాలయాలకు తెల్లవారు 2 గంటల సమయానికి భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. సమీపంలోని బావుల వద్ద చన్నీటి స్నానమాచరించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మాడుగుల కేంద్రంలో కృష్ణ భూపాలేశ్వర, ఉబ్బలింగేశ్వర, భీమలింగేశ్వర, స్వర్గలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు రద్దీ ఏమాత్రం తగ్గలేదు. మండల పరిసర గ్రామాల్లో చరిత్ర కలిగిన జంపెన శివాలయం, ఎం.కోడూరు కాశీవిశ్వేశస్వామి ఆలయాలకు కూడా భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని శివాయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిమిరాం శివాలయంలో మాజీ డిప్యూటీ సీఎం బూడిముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వనదేవీశ్వర ఆలయం, పెద నందిపల్లి, చిననందిపల్లి, బి.కింతాడ,తెనుగుపూడి శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చోడవరం, చీడికాడ, దేవరాపల్లి మండలాలనుంచి భక్తులు తిమిరాం శివాలయానికి అధిక సంఖ్యలో వెళ్లారు.



కె.కోటపాడు గౌరీపరమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండల కేంద్రంలోని గౌరీపరమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు జేగురుపాటి భీమలింగేశ్వరరావుస్వామి వారికి మారేడు దళాలతో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం హర హర మహాదేవ... నినాదాలతో మార్మోగింది. మహిళలు దీపాలు వెలిగించి వ్రతాలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు శరగడం సన్యాసినాయుడు, సంఘం మహిళలు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మండలంలో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. చమ్మచింత కాశీఅన్నపూర్ణేశ్వరస్వామి ఆలయం దగ్గర భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివునికి అభిషేకాలు చేశారు. వీరభూపతిఅగ్రహారంలో పురాతన రామాలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ అపన దివాణం దంపతులు పూజలో పాల్గొన్నారు. అలాగే జిల్లేడిపూడి నూకంబికాదేవి ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తులో ఉన్న శివలింగానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకపోతే చట్టపరమైన చర్యలు

- పీపీపీ విధానంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు కృషి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరమణ



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకటరమణ

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ట్రేడ్ లైసెన్స్ తీసుకోని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ హెచ్చరించారు. పెదబొడ్డేపల్లి ఏఎంసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులు రోజుకు రూ.2,500 టర్నోవర్ ఉంటే తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని 31 మందికి నోటీసులు జారీ చేయగా, 11 మంది ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందుకు వచ్చారని తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత చెక్‌పోస్టులు ఆకస్మిక తనిఖీలు చేయడం ద్వారా రూ.15 లక్షలు అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఆర్టీసీ కార్గో బస్సులో మార్కెట్ సెస్సు చెల్లించకుండా తరలిస్తున్న తొమ్మిది టన్నులు పైగా జీడి పప్పును రాజుపాకల చెక్ పోస్టు వద్ద పట్టుకొని రూ.60 వేల పైగా సెస్సు కట్టించామని ఆయన తెలిపారు. మొదటి శ్రేణి ధాన్యానికి రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి రూ.2369 మద్దతు ధర ఇస్తున్నట్టు చెప్పారు. మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్‌ని పీపీపీ విధానంలో ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుఆదేశాలతో రైతు బజార్‌ను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోటవురట్ల రోడ్డు వైపు షాపులు నిర్మించడానికి రూ.90 లక్షలతోను, మార్కెట్ యార్డులో రూ.45 లక్షలతో షాపులు, గోదాములు మరమ్మతులకు అంచానాలు తయారు చేయించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కన్నయ్యనాయుడు, కార్యదర్శి భువనేశ్వరి పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా



రామన్నపాలెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల కోసం స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పోరాడారని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు పేర్కొన్నారు. రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం బిర్సా ముండా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలీ చేశారు. అనంతరం వరహాలబాబు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడు ముండా అని పేర్కొన్నారు. పార్లమెంట్ హాలులో బిర్సా ముండా చిత్రపటం ఏర్పాటు చేయడం గిరిజనులకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. విద్యార్థులు ముండా జీవితం గురించి తెలుసుకోవాలని కోరారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచనను వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరిస్తున్నట్టు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చింతలబుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ మండలఅధ్యక్షుడు బూరే బాబూరావు, నాయకులు లలితానాయుడు, కేవీ.రమణ పాల్గొన్నారు.

'పీపీపీ విధానం రద్దు చేయాలి'

మాకవరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలకు పీపీపీ విధానం అమలును రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొండలఅగ్రహారంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సంతకాల కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పీపీపీ విధానం రద్దు చే సేవరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటరమణ, ఎంపీపీ సర్వేశ్వరావు, వైసీపీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని బీజేపీ కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. పార్టీ కార్యాలయంలో పట్టణ విభాగం అధ్యక్షుడు బోళెం అప్పన్నదొర, రూరల్ అధ్యక్షుడు నిద్ర శ్రీను ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు బూత్ కన్వీనర్లు నియామకాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ కేవీ సత్యనారాయణ, గాదె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లలో అవినీతిపై సమగ్ర విచారణ చేయండి

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూళ్లలో అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బిల్ కలెక్టర్ అవినీతికి పాల్పడినట్టు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు స్పందించకపోవడం అన్యాయమని వాపోయారు.

మహిళలకు రక్షణ కల్పించాలని ర్యాలీ

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించాలని సోమవారం భారీ ర్యాలీ జరిగింది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అబీద్ సెంటర్ వరకు, కలెక్టర్ కార్యాలయం వరకు వచ్చి ఆర్డీవో వీవీరమణకు వినతి పత్రం ఇచ్చారు. దాడులు, వేధింపులు, అత్యాచారాలు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, గీతాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం ప్రధాన రహదారి ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

చెట్టుపల్లిలో నూతన పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ కోటా పింఛన్లను కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ నెల ఒకటో తేదీ ఇవ్వాల్సిన ఫించన్లను లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం అందజేశారు. భర్త చనిపోయి 20 రోజులకు ముందే ప్రభుత్వం నూతన పంఛన్లు మంజూరు చేస్తున్నదని ఈ సందర్భంగా కూటమి నాయకులు పేర్కొన్నారు. ఉప సర్పంచ్ గజాల సూరిబాబు, జనసేన ఉమ్మడి విశాఖ ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, నాయకులు ఇన్నం రమణ, సతీశ్, ఎ.రాజు పాల్గొన్నారు.

నైపుణ్య పరీక్షల్లో విద్యార్థినుల ప్రతిభ

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో బ్యూటీ, వెల్‌నెస్‌ట్రేడ్‌కు చెందిన నైపుణ్యంపై సోమవారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఫేషియల్, త్రెడింగ్, మెడిక్యూర్, పెడిక్యూర్, మేకప్ తదితర విభాగాల్లో గ్రూపులు వారీగా పోటీలు జరిగాయి. 15 బృందాల మధ్య జరిగిన పోటీల్లో రెండు బృందాలు గెలుపొందారు. ప్రత్యేకాధికారి భువనమాధురి విజేతకు బహుమతులు అందజేశారు. అలాగే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఎనిమిది మంది విద్యార్థినులు ఈ నెల 7న మాడుగలలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆమె తెలిపారు. ఒకేషనల్ టీచర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణపులోవ నుంచి 250 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని సర్పా నదిలోకి విడిచి పెడుతున్నామని ఏఈ డి.సూర్య తెలిపారు. రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా, సోమవారం నాటికి 458.08 అడుగులకు చేరిందన్నారు. దీంతో రెండు గేట్లు ఎత్తివేసి 250 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచి పెట్టినట్టు ఏఈ చెప్పారు.

రహదారి దుస్థితిపై నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజన్నపేట క్వారీ వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని అర్ల, రాజన్నపేట, గుర్రాలబైల గ్రామాల గిరిజనులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వడ్డిప నుంచి గదబపాలెం, గుర్రాలబైల, అర్ల వరకు పీఎం సడక్ యోజన కింద తారు రోడ్డు నిర్మాణం చేపట్టారని, నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో రవాణాకు ఆటంకం లేకుండా చేయాలని వారు కోరారు.

అదృశ్యమైన వంగసార ఆశ్రమ విద్యార్థినుల అప్పగింత

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగసార బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి అదృశ్యమైన ఐదుగురు విద్యార్థినులను పట్టుకుని ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌కి అప్పగించామని స్థానిక ఎస్‌ఐ వి. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం పదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు పాఠశాల విడిచి వెళ్లిపోయారన్నారు. దీంతో మరుసటి రోజు ఉదయం పాఠశాల వార్డెన్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా పోలీసులు అప్రమత్త చేసి ప్రత్యేక బృందాన్ని నియమించారన్నారు. కేవలం గంటల వ్యవధిలోనే మధ్యాహ్నం చిన్నగెడ్డ సమీపంలో వున్నట్టు గుర్తించామన్నారు. విద్యార్థినులను సురక్షితంగా పాఠశాలకు తీసుకు వెళ్లి వార్డెన్‌కి అప్పగించామన్నారు. విద్యార్థినులకు ఏఎస్పీ కౌన్సెలింగ్ చేశారన్నారు.

వలంటీర్ల రిలే దీక్షలు ప్రారంభం



వలంటీర్లు రిలే దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ వలంటీర్లు సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై వైసీపీ రాజకీయ ముద్ర వేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు వారికి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ రణభేరి పేరిట నిరాహార దీక్షలు చేపట్టి, ఈనెల 7వ తేదీన పాడేరులో భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, మండల కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

మద్దిగరువు రహదారిలో తుప్పలు తొలగింపు

జి.మాడుగుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల నుంచి మద్దిగరువు రహదారిలో తుప్పలను తొలగిస్తున్నట్టు బొయితిలి సర్పంచ్ లనంగి మాలన్న తెలిపారు. వాకపల్లి మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపుల తుప్పలు ఎదిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల పంచాయతీ నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నామన్నారు. తుప్పలు తొలగించేందుకు అయ్యే నిధులను ఆర్అండ్‌బీ అధికారులు పంచాయతీకి రీయింబర్స్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రహదారిలో పోలీసుల ఆధ్వర్యంలో రోజుకు మూడు పూటలు ఆర్టీసీ ఉచిత బస్సు రాకపోకలు నడుస్తుందన్నారు.

సప్పర్లలో మూడు నెలలుగా మూగబోయిన బీఎస్ఎన్ఎల్

గూడెంకొత్తవీధి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సప్పర్ల పరిసర ప్రాంతాల్లో మూడు నెలలుగా బీఎస్ఎన్ఎస్ సేవలు మూగబోయాయి. సెల్ టవర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సిగ్నల్స్ నిలిచిపోయాయి. అలాగే గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది ఇంటర్నెట్ సేవలు అందక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సాంకేతిక సమస్యను పరిష్కరించాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

కొయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జీవన వృక్ష చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కొరుప్రోలు రమణబాబు అన్నారు. సోమవారం రొబ్బసింగి, గదబపాలెం గ్రామాల్లో రైతులకు ఉచితంగా జీడిమామిడి మొక్కలను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రతి విద్యార్థికి జామ మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు మాట్లాడుతూ మానవులకు ఉపయోగపడే మొక్కలను పెంచేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గోరా పంతులుబాబు, కూడా పద్మ, ట్రస్టు కార్యదర్శి సూరిబాబు, సర్పంచ్ ఉల్లి నరసమ్మ పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతులకు కలెక్టర్ ఆర్థిక సాయం



వన్నెడ పాఠశాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలం వన్నెడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. పాఠశాల హెచ్‌ఎం పి.నవీన్ కుమార్, మాతృభాష వలంటీర్ కె.రాంబాబు సోమవారం కలెక్టర్‌ను కలిసి పాఠశాల భవనం మరమ్మతులకు గురయ్యిందని వివరించారు. గ్రామస్థులు కొంత మేర ఆర్థిక సహాయాన్ని అందించారని, మరికొంత నగదును దాతలు అందించారని చెప్పారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ వెంటనే స్పందించి తన వంతుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. పాఠశాల ప్రారంభోత్సవానికి రావాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు.

విజయవంతంగా నియోజకవర్గ స్థాయి పోటీ పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు తదితరులు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నియోజకవర్గ స్థాయి పోటీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని జిల్లా నోడల్ అధికారి బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల, మండల స్థాయి పోటీలను నిర్వహించామన్నారు. పాఠశాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించిన అనంతరం ఈ పోటీ పరీక్షలను నిర్వహించామన్నారు. ఇక్కడ ప్రతిభను చూపిన విద్యార్థులను అమరావతిలో జరిగే కార్యక్రమానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పరీక్షల నిర్వాహణను డీఈవో బ్రహ్మాజీరావు పరిశీలించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ఎస్.విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో గాయపడిన మహిళ మృతి

జి.మాడుగుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడుతూరు పంచాయతీ బొబ్బంపాడు గ్రామంలో ఆదివారం భూవివాదంలో దాడికి గురైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామంలో భూ వివాదంలో గెమ్మెలి సత్తిబాబును పాంగి రాంప్రసాద్ కర్రతో కొట్టి హతమార్చిన విషయం తెలిసిందే. అడ్డు వచ్చిన సత్తిబాబు భార్య నీలమ్మను కూడా తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు ఆమెను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

గిరి మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

» జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరి మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ చెప్పారు. భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాల కార్యక్రమాన్ని సోమవారం ఐటీడీఏ కాఫీహౌస్‌లోని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ వన్‌దన్ వికాస కేంద్రాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ ధరకు కొనుగోలు చేసి, గిరి మహిళల సాధికారత సాధించి, ఆర్థిక శక్తిగా ఎదిగేలా కృషిచేస్తున్నామని చెప్పారు. ఏజెన్సీలో పండే అల్లం, కాఫీ, మిరియాలు, పసుపు, అడ్డాకులు, రాజ్‌మా తదితర వాటిని మార్కెటింగ్ చేయడం ద్వారా వన్‌దన్ వికాస కేంద్రాలు లక్ష్యాలను చేరుకుంటాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 106 వన్‌దన్ వికాస కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ. జన్ జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఏపీవో వేంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ మురళి, పీఎమ్‌యూ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



బిర్సాముండా జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమా

జిల్లాలో సేంద్రీయ సాగును ప్రోత్సహించాలి

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సేంద్రీయ రైతు సంఘాలను ఏర్పాటు చేసి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ అన్నారు. సోమవారం అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, డీఆర్‌డీఏ, కోఆపరేటివ్, మార్కెటింగ్ తదితర శాఖలపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనలో భాగంగా 36 రకాల ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని జిల్లాలో వ్యవసాయాభివృద్ధి సాధించాలన్నారు. పంట మార్పిడి విధానం ద్వారా పంట దిగుబడులు సాధించవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీ ఎరువులను వాడే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌బీఎస్.నందు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మాతునాయుడు, జిల్లా ఉద్యాన శాఖాధికారి కర్ల పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు



పాడేరురూరల్: భక్తులతో కిటకిటలాడిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం



చింతపల్లి: బౌడ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాడేరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకొని శివనామ స్మరణతో మార్మోగాయి. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న సోమనాథేశ్వ స్వామి ఆలయాన్ని వందలాది మంది భక్తులు దర్శించుకొని అభిషేకాలు చేశారు. భక్తులకు ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు, తాగునీటిని అందించారు. అదే విధంగా గిరికైలాస క్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు తాకిడి పెరిగింది. భక్తులకు ఆధ్యాత్మిక ధర్మకర్త కొట్టగుల్లి రమాదేవి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, కె.భాగ్యలక్ష్మి, ఉప్పల వెంకటరత్నం, సిద్దినాతి కొండలరావు, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, వి.రాజబాబు, డి.బాబూరావు, బీవీఎస్. ముకుందరావు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. స్వయం భూలింగేశ్వరస్వామి ఆలయం, త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని సంగోడి స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయం, వంతాడపల్లి శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఇటీవల జరిగిన కాశీబుగ్గ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రసిద్ధి గాంచిన ఆలయాల్లో ముఖ్యపర్వదినాల్లో ముందస్తు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ పర్యవేక్షణలో సీఐ డి.దీనబంధు శివాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలరించిన కార్తీక దీపార్చన

పాడేరు సోమనాదేశ్వస్వామి ఆలయంలో సోమవారం రాత్రి భక్తులు కార్తీక దామోదరుడికి ఘనంగా దీపార్చన చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కోనేటిలో దీపార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలను నీటిలో వదలడం వల్ల చీకటిని, దుష్టశక్తులను పారదోలి



సీలేరు శివాలయంలో పూజలను నిర్వహిస్తున్న అర్చకులు

ఆనందాన్ని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

మండలంలోని బౌడ శివాలయంలో కార్తీక మాసం రెండోసోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు కుంకుమార్చ, అభిషేకాలు, తైలాభిషేకం చేశారు. జీకేవీధి, చింతపల్లి, జి.మాడుగుల, నర్సీపట్నం ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం వరకు ఆలయంలో రద్దీగా కనిపించింది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు అందజేశారు.

సీలేరులో...

కార్తీకమాసం రెండో సోమవారం సీలేరు శివాలయం శివ నామస్మరణతో మార్మోగింది. తెల్లవారు జామున 3 గంటల నుంచే భక్తులు శివాలయానికి చేరుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు రామశర్మ పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. మహిళా భక్తులు సీలేరు నదిలో స్నానాలను ఆచరించి శివాలయం ఆవరణలోని ధ్వజ స్తంభం వద్ద, ఉసిరిచెట్టు వద్ద, రావిచెట్టు వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం శివుడిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. అలాగే కార్తీక మాసం సందర్భంగా సాయంత్రం శివాలయం, మారెమ్మ ఆలయాల్లో ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు.

అధికారుల గైర్హాజరుకు నిరసనగా మండల సమావేశం బహిష్కరణ

» ఎంపీడీవో చర్యలు తీసుకోవడం లేదు

» ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు విమర్శ

జి.మాడుగుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడాన్ని నిరసిస్తూ ప్రజాప్రతినిధులు సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ.. మూడు నెలలకొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం దారుణమని మండిపడ్డారు. గత సమావేశాల్లో హాజరుకాని అధికారులపై చర్యలు చేపడతామని ఎంపీడీవో హామీ ఇచ్చారని, కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు లేనందునే తరచూ గైర్హాజరవుతున్నారని ఆరోపించారు. తదుపరి సమావేశంలో పూర్తిస్థాయిలో అధికారులతో సమావేశం నిర్వహించాలని, ఇదే పరిస్థితి కొనసాగితే సమావేశానికి హాజరయ్యేది లేదని వారు తేల్చి చెప్పారు. అంతకు ముందు సమావేశ ప్రారంభంలో ఎంపీడీవో డేవిడ్‌రాజు మాట్లాడుతుండగా సభ్యులు అడ్డుకొని.. తమకు రెండేళ్ల నుంచి గౌరవవేతనాలు చెల్లించకపోవడంపై నిలదీశారు. ఆరు నెలల గౌరవ వేతనాలు వచ్చాయని, వాటిని త్వరలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



మండల సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు

డ్రోన్లు ఎగురవేస్తే కఠిన చర్యలు తప్పవు

అరకులోయ సీఐ ఎల్.హిమగిరి



అరకులోయ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరకులోయ,అ నంతగిరి, హుకుంపేట మండలాల పరిధిలో డ్రోన్లు ఎగురవేస్తే కఠిన చర్యలు తప్పవని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి హెచ్చరించారు. హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో జరుగుతున్న సర్వేలను గిరిజనుల ఆందోళనల నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు నిలిపివేశారని చెప్పారు. రాత్రి వేళలో డ్రోన్లతో అపరిచితులు సర్వేలు చేస్తుండటంపై ఆయా ప్రాంత గిరిజనుల భయాందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గిరి గ్రామ పరిసరాల్లో ప్రభుత్వం ఎటువంటి సర్వేలకు అనుమతులు ఇవ్వలేదని సీఐ స్పష్టం చేశారు. ఆకతాయిలు కావాలని రాత్రి వేళలలో డ్రోన్లు ఎగరవేస్తున్నారన్న అనుమానం వ్యక్తం చేశారు.

ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అనంతగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాశీపట్నం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీక సోమవారం ప్రారంభం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్రి చెట్టు తొర్రలో వెలసిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి పెద్ద చరిత్ర ఉంది. దీంతో అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం నుంచి భక్తులు ఆలయాన్ని దర్శించుకుని, వనసమారాధనలు జరుపుకుంటారు.

తారాబులో సదుపాయాలు కల్పించాలి



వాగులో దిగి నిరసన తెలుపుతున్న గిరిజనులు

పెదబయలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జామిగుడ పంచాయతీ తారాబు గ్రామానికి సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తారాబు వాగులో దిగి నిరసన కార్యక్రమం చేపట్టారు. తారాబులో పాఠశాల భవనం నిర్మాణంలో నాణ్యతలేని పనులు చేశారని మండిపడ్డారు. గ్రామంలో 80 కుటుంబాలు కలిగి ఉన్న మౌలిక సదుపాయాలు కల్పనకు నోచుకోలేదని వాపోయారు. అలాగే తారాబు గ్రామానికి బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. మూడు పంచాయతీల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు తారాబు వాగు దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, తక్షణమే తారుబు వాగులో వంతెన నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని వారు విన్నవించారు.

సింగర్భలో ప్రత్యేక పశు వైద్య శిబిరం

అనంతగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండిబ పంచాయతీ సింగర్భ గ్రామంలో సోమవారం ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. కాశీపట్నం, అనంతగిరి పశు వైద్యాధికారులు సాగిరి గణేశ్వరరావు, అనిల్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని మేకలు, గొర్రెలు కలిపి 33, ఆవులు, గేదెలు 12, రెండు ఎద్దులు, మూడు దూడల మృత్యువాత పడ్డాయని చెప్పారు. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలన చేసిన అనంతరం నష్టపరిహారంపై ప్రభుత్వానికి నివేదికను పంపించామని తెలిపారు.

భూబదలాయింపు చట్టం పక్కాగా అమలు చేయాలి : ఎంపీపీ



తహశీల్దార్ శంకరరావుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా భూబదలాయింపు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. సోమవారం నూతనంగా నియమితులైన తహశీల్దార్ కె. శంకరరావుని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ఎంపీపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని లంబసింగి, తాజంగి, పెదబరడతోపాటు అన్నవరం, చింతపల్లి పంచాయతీలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈప్రాంతంలో ఆదివాసీలు నష్టపోకుండా భూబదలాయింపు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే ఏళ్ల తరబడి ఆదివాసీలు మ్యూటేషన్లు చేయించుకోకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. ఈకార్యక్రమంలో కోఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి, వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, సాగిన గంగన్న పడాల్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకురాలు నూకరత్నం మృతి



బేతా నూకరత్నం(ఫైల్)

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నేత బేత నూకరత్నం(56) గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆమె కుటుంబ సభ్యులతో గడిపారు. సాయంత్రం ఒక్కసారిగా ఛాతిపై నొప్పి రావడంతో వెనువెంటనే ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె టీడీపీలో వార్డు సభ్యురాలు స్థాయి నుంచి పార్టీలో నియోజకవర్గ స్థాయి తెలుగు మహిళా నాయకురాలుగా ఎదిగారు. ఆమె మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, నాయకులు లక్ష్మణరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు అన్నారు. ఆమె భౌతికకాయానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామీణ బ్యాంక్ ఖాతా నంబర్లకు గడువు పెంచాలి

జి.మాడుగుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వికాస్ బ్యాంక్ మార్పులు క్రమంలో కొత్త ఖాతా నంబర్లకు సమయం పొడిగించాలని గిరిజన ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు ఉంటుందని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కొండపల్లి శాయిప్రవీణ్, వెంకట్ పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి'

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. సోమవారం నూతనంగా కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగాం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీలో కష్టపడి చదివితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా పొందవచ్చునన్నారు. డిగ్రీతో పాటు గ్రంథాలయంలోని స్టడీ మెటీరియల్‌ని ఉపయోగించుకుని పోటీ పరీక్షల్లో రాణించేందుకు సిద్ధపడాలన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకానికి రేషన్ పంపిణీ చేయాలి




లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శంకరరావు

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ డీఆర్ డిపోల ద్వారా లబ్ధిదారులకు కచ్చితమైన తూకానికి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని స్థానిక తహశీల్దార్ కె. శంకరరావు అన్నారు. సోమవారం తహశీల్దార్ బయలుకించంగి, చౌడుపల్లి, చింతపల్లి డీఆర్ డిపోలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15వ తేదీలోగా లబ్ధిదారులందరికి రేషన్ పంపిణీ చేయాలన్నారు. చింతపల్లి డీఆర్ డిపో భవనం వర్షాలకు దెబ్బతినడంతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బిరిమిశాలలో డ్రైనేజీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనుగుపల్లి పంచాయతీ బిరిమిశాలలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మాణాలకు సర్పంచ్ ఎం.మీనా, ఎంపీటీసీ సభ్యురాలు రేగం భానుమతి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు భానుమతి మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మాణాలకు రూ. 3 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందని సర్పంచ్ మీనా అన్నారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బాలకృష్ణ, నాయకులు రమణబాబు, ఈశ్వరమ్మ, ఈశ్వరరావు, సత్యనారాయణ, మత్స్యబాబు, మోదన్న పాల్గొన్నారు.


అంతర్జాతీయ సెమినార్‌కు విజయభారతికి ఆహ్వానం



విజయ భారతి

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో నిర్వహించే అంతర్జాతీయ సెమినార్‌కు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతిని నిర్వాహకులు ఆహ్వానాన్ని పంపించారు. ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో శ్రీలంక సబరగమువ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ రెండో సెమినార్ హిక్కడువలో నిర్వహిస్తున్నది. ఈ సెమినార్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై ప్రిన్సిపాల్ ప్రసంగించనున్నారు.

పెదబయలులో భిన్న వాతావరణం



పెదబయలులో ఎండ కాస్తూ వర్షం పడుతున్న దృశ్యం

పెదబయలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం భిన్న వాతావరణం నెలకొంది. వేకువజామున పొగ మంచు దట్టంగా కురిసింది. పొగ మంచు కారణంగా వాహనచోదకులు హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. అనంతరం ఓ మోస్తరుగా ఎండ కాసింది. మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి నాలుగు గంటల సమయం వరకు ఎండ కాస్తూనే వర్షం కురిసింది. దీంతో పెదబయలు వారపు సంతకు వచ్చిన వినియోగదారులు, వర్తకులు ఇబ్బందులు పడ్డారు. వారపు సంతలో రోడ్డు పక్కన వ్యాపారులు గొడుగులు వేసుకొని వ్యాపారాలు కొనసాగించారు.



కరెంటు కష్టాలు ఇంకెన్నాళ్లు?

... 5వ పేజీ తరువాయి

సరఫరా నిలిచిపోతే సీలేరు జెన్‌కో నుంచి నిర్మించిన 33 కేవీ విద్యుత్ లైన్ ద్వారా రెండు మండలాల ప్రజలకు విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశముంటుంది.

ఏడాదైనా మంజూరుకాని అనుమతులు

సీలేరు నుంచి దుప్పిలవాడ వరకు 33 కేవీ విద్యుత్ లైన్ రిజర్వుడ్ ఫారెస్టు భూమిలో నిర్మించాల్సివుంది. సుమారు 20 ఏళ్ల క్రితం సీలేరు నుంచి దుప్పిలవాడ వరకు విద్యుత్‌లైన్ నిర్మించారు. అయితే వినియోగంలో లేక ఈ విద్యుత్‌లైన్ పాడైపోయింది. అప్పట్లో విద్యుత్ లైన్ నిర్మాణానికి ఈపీడీసీఎల్ అధికారులు అటవీశాఖ అనుమతులు తీసుకున్నారు. తాజాగా నూతన విద్యుత్ లైన్ నిర్మాణానికి పాత అనుమతులను మళ్లీ పరిశీలించి కొత్త అనుమతులు మంజూరు చేయాల్సి వుంది. ఈ అనుమతుల కోసం చింతపల్లి డివిజనల్ కార్యాలయం అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించి అమరావతి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుకి ప్రతిపాదనలను 2024 నవంబరు ఆఖరిలో పంపించారు. ప్రతిపాదనలు పంపించి ఏడాది గడిచినా అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ విద్యుత్‌లైన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయలేదు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయమై అటవీశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసినప్పటికి పనులు ప్రారంభించే పరిస్థితిలేక ఆదివాసీలకు విద్యుత్ కష్టాలు తప్పడం లేదు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉన్నందున సంత స్థలాలను మార్చాలని ఆదేశించారు. ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ జిల్లాలోని ఎన్ని ప్రైవేటు వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని ఆరా తీశారు. మద్యం దుకాణాలపై పోలీస్‌శాఖ నిఘా పెట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ, డీఎస్పీ షెహబాజ్ అహ్మద్, ఆర్అండ్‌బీ ఈఈ బాల సుందరంబాబు, డీటీవో ప్రకాశ్‌రావు, అదనపు వైద్యాధికారి టి.ప్రతాప్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డి.హేమలతరాణి, పీఆర్ ఈఈ కొండయ్యపడాల్, జిల్లా పంచాయతీ అధికారి కె.చంద్రశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వన్ ధన్ వికాస కేంద్రాలపై కలెక్టర్ అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల క్రితం యంత్రాలను సమకూర్చి ఆపై వదిలేశారని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన మహిళలకు ఆదాయం కల్పించే మార్గం ఇదేనా? అని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు శిక్షణ ఇవ్వకుండా కేంద్రం ఎలా నడుపుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళి, సర్పంచ్ శారద, తౌడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం పైసా వసూల్

... 5వ పేజీ తరువాయి

ఇంటర్వ్యూకు హాజరయ్యారు. పదోన్నతుల ప్రక్రియలో 100 మార్కులు ఉంటాయి. ఇందులో 80 మార్కులు సదరు అధికారి/ఉద్యోగి సర్వీస్‌కు సంబంధించి, మరో 10 మార్కులు సదరు అధికారి/ఉద్యోగి పని తీరుపై ఆధారపడి (పైఅధికారి వేస్తారు) ఉంటాయి. మిగిలిన పది మార్కులకు ఇంటర్వ్యూ. ఇంటర్వ్యూలన్నీ పూర్తిచేసి గత నెల 31న పదోన్నతులకు సంబంధించి ఆర్డర్లు ఇచ్చారు. అయితే ఇంటర్వ్యూలు ముగిసిన అనంతరం పదోన్నతుల జాబితాలో పేరు కలిగిన వారి వద్ద నుంచి బ్యాంకులో కీలక వ్యక్తి సన్నిహితుడు ఒకరు వసూళ్లకు తెరతీశారు. పోస్టును బట్టి మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ తీసుకున్నట్టు చెబుతున్నారు. నగరంలో ప్రముఖ మోటారు వాహనాల కంపెనీలో పనిచేసే వ్యక్తి డీసీసీబీలో కీలక వ్యక్తి ఛాంబర్‌కు వస్తున్నాడు. మార్కెట్ వ్యవహారాలలో అనుభవం ఉన్న ఆయన స్వయంగా ఫోన్ చేసి ఫలానా చోటుకు సొమ్ములు తీసుకురావాలని కోరినట్టు చెబుతున్నారు. కీలక వ్యక్తి సూచన మేరకు సుమారు కోటి రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ సొమ్ములు ఇవ్వాల్సిందేనని దబాయించారని కొందరు ఉద్యోగులు అంటున్నారు. సొమ్ముల వ్యవహారంపై కొందరు సిబ్బంది ఆప్కాబ్‌కు ఫిర్యాదులు చేశారని చెబుతున్నారు. కాగా ఈ ఆరోపణలను బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ వద్ద ప్రస్తావించగా ఆప్కాబ్ నిబంధనలు, మార్గదర్శకాల మేరకూ పదోన్నతులు కల్పించామన్నారు. మెరిట్, రోస్టర్ మేరకు ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థుల జాబితా తయారుచేశామన్నారు. పదోన్నతులు పారదర్శకంగా చేపట్టామని పేర్కొన్నారు.

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతినెలా పలువురు టీచర్లు పదవీ విరమణ చేస్తున్నారు. 1989 నుంచి 1998 మధ్య డీఎస్సీ ద్వారా నియమితులైన పలువురు టీచర్లు ఈ ఏడాది నవంబరు, డిసెంబరు, వచ్చే ఏడాది మే నెలాఖరులోగా పదవీ విరమణ చేయనున్నారు. ఇంకా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆయా పోస్టులకు స్కూలు అసిస్టెంట్లతో భర్తీచేయనున్నారు. దీంతో స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీలు ఏర్పడనున్నాయి.

ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో కొందరు టీచర్లు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి ఏర్పడబోయే ఖాళీల వివరాలను మండల విద్యాశాఖాధికారుల నుంచి జిల్లా విద్యా శాఖ సేకరిస్తోంది. వచ్చే ఏడాది మే నెలాఖరుకల్లా సుమారు 500 నుంచి 600 వరకు ఖాళీలు ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. మండలాల నుంచి పూర్తి వివరాలు వచ్చిన తరువాత గానీ ఖాళీలపై స్పష్టత రాదని అంటున్నారు. పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీల వివరాలు నివేదిక సిద్ధం చేస్తున్నామని విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి నియామకం

... 5వ పేజీ తరువాయి

వరకూ రంపచోడవరం తెలుగుదేశం ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ దక్కకపోయినా నిరాశ చెందకుండా పార్టీ కోసం నియోజకవర్గంలో తిరుగుతూ కార్యకర్తలు, మండల నాయకుల సమస్యలపై స్పందించి తన వంతుగా కృషి చేశారు. తొలుత ఆమెకు జీసీసీ డైరెక్టర్ పదవి ఇచ్చారు. అనంతరం జరిగిన కసరత్తులో ఆమెను ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియమించారు.

బూడిద కాలుష్యం

పరవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) నుంచి ఫ్లైయాష్ సమీపంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాలపై ఎగిసిపడుతున్నది. రెండు రోజుల నుంచి విపరీతంగా బూడిద వస్తున్నదని ఈ గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇళ్లపైన, ఖాళీ స్థలాల్లో, పంటలపైన, ఆరుబయట వున్న వస్తువులపైన బూడిద పేరుకుపోతున్నది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోనందునే ఎన్టీపీసీ నుంచి బూడిద తమ గ్రామాలపైకి వస్తున్నదని ఆరోపిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్ స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి.



దీక్షిత్ శెట్టి

'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

PARAS